పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# 86. అత్ తారిఖ్ సూరా పరిచయం

ఈ సూరా మక్కాలో అవతరణ, 17 ఆయత్‌లు, 1 రుకూ ఉన్నాయి.

ఈ సూరా మక్కాలో అవతరించింది. దైవప్రవక్త (స) మక్కా వారికి పరలోకం వస్తుందన్న వార్తను వినిపిస్తూ లెక్క చెప్పవలసి ఉంటుందన్న నమ్మకం కలిగిస్తున్నారు. ఆ సమయంలో ఈ సూరా అవతరింపజేయబడింది. తిరస్కారులు, ముష్రికులు ఈ సందేశాన్ని ఎగతాళి చేస్తూ పరలోకం ఎంతమాత్రం రాదు. లెక్కలు ఇవ్వవలసిన పనీ లేదు అన్నారు. జవాబుగా అల్లాహ్ సెలవిచ్చాడు – పరలోకం (అంతిమదినం) తప్పక వస్తుంది. లెక్కలు తీసుకోవడమూ తప్పక జరుగుతుంది. అందుకు రుజువుగా అల్లాహ్ ఇలా అన్నాడు – ఆకాశంలో మెరుస్తున్న నక్షత్రాల వంక చూడటం లేదా? ఈ నక్షత్రాలు కోట్లాదిగా ఉన్నాయి. ఆసలు ఇవి మనుష్యుల కర్మల వైపు చూస్తున్న కళ్ళు. ఇవి కాపలాదారులు. గూఢాచారులునూ. రాత్రి చీకటిలో మనిషి చీకట్లో తననెవ్వరూ చూడటం లేదని భావించి పాపం చేస్తాడు. అయితే అప్పుడు కోట్లాది నక్షత్రాలు అతడి వంక చూస్తుంటాయి. అంతిమ దినాన దైవ దర్బారులో ఓ అల్లాహ్! ఈ వ్యక్తి రాత్రి పాపం చేస్తూ ఉండగా మేము చూశామని సాక్ష్యమిస్తాయి.

లక్షలాది కోట్లాది సాక్ష్యాలు న్యాయస్థానంలో "ఓ అల్లాహ్! ఈ వ్యక్తి రాత్రి పాపం చేస్తుండగా చూశామని" సాక్ష్యమిస్తాయి. ఒక న్యాయస్థానంలో లక్షలాది సత్యవంతులయిన సాక్షులు సాక్ష్యం పలికితే నేరస్తుడు శిక్ష నుండి ఎలా తప్పించుకోగలడు? మరి రాత్రివేళ ఇంతమంది కావలి వాళ్ళు ఉంటే, పగలు ఎంతమంది కావలివాళ్ళు ఉంటారో అంచనా వెయ్యండి. ఇంకా కిరామన్, కాతిబీన్‌లను ప్రతి మనిషి వెంట ఉంచాడు అల్లాహ్. ఒక దూత పుణ్యాన్ని, మరొక దూత పాపాన్నీ వ్రాస్తున్నారు. ఇంకా మన కాళ్ళూ చేతులూ, కళ్ళూ చెవులు అన్నీ సాక్ష్యమిస్తాయి. మనం చేసిందంతా వివరిస్తాయి. మరి మనం పాపం చేసి శిక్ష నుండి ఎలా తప్పించుకోగలం? మనిషి వెనుక ఇంతమంది కావలివాళ్ళు గూఢాచారులూ నియమించడానికి గల కారణం. అంతిమదినాన అతడి సత్కర్మలకు బహుమానం, దుష్కర్మలకు శిక్షా ఇవ్వబడాలి.

మరణించిన తర్వాత మనిషిని అల్లాహ్ తిరిగి పుట్టించగలడు. అల్పమైన ఒక నీటి బిందువుతో, నడిచే, తిరిగేవాడు ఆలోచించే, అర్థం చేసుకునే వాడు, కారు, రైలు, విమానం వంటి వస్తువులు తయారుచేసే మనిషిని దైవం పుట్టించగలిగినప్పుడు చనిపోయిన ఒక మనిషిని తిరిగి పుట్టించడం అతడికి సాధ్యం కాదా? దైవం మనిషిని మొదటిసారి పుట్టించినప్పుడు రెండవసారి పుట్టించడం ఎందుకు సాధ్యం కాదు? నిశ్చయంగా అల్లాహ్ మానవుడ్ని బ్రతికించగలడు. ఆయన గొప్ప శక్తిశాలి. అద్భుతాలను సృష్టించేవాడు. ఖుర్ఆన్ చెప్పిన విషయం నిర్ణయాత్మకమైనది. దైవం మానవుడ్ని తిరిగి బ్రతికిస్తాడు. లెక్క తీసుకుంటాడు. పుణ్యశీలి అయితే అతడికి స్వర్గం, పాపి అయితే నరకం లభిస్తాయి. అందుకు రుజువు ఇలా ఉంది. ఏ విధంగానయితే సముద్రపు నీరు ఆవిరిగా మారి పైకి వెళ్ళిపోతుందో తిరిగి వర్షంగా భూమిపైకి తిరిగి వచ్చేస్తుందో ఇదేవిధంగా మనిషి అల్లాహ్ వద్ద నుండి వచ్చాడు. తిరిగి

ఒకనాడు అల్లాహ్ దగ్గరకు వెళ్ళిపోతాడు. ఏ విధంగా భూమి చీల్చబడినప్పుడు మొక్క బయటికి వస్తుందో, ఇంకా భూమి విచ్చుకున్నప్పుడు నీటి వూట వెలువడుతుందో అదేవిధంగా ఒకరోజు వస్తుంది. భూమి చీల్చబడుతుంది. భూమిలో ప్రకంపనం జరిగినప్పుడు చనిపోయిన వారంతా బ్రతికించబడి భూమిలో నుండి బయటకు వస్తారు. అందుకోసమే భూమిని చీలిపొయ్యేదీ, చీలిక గలదీ అన్నారు.

ఖుర్ఆన్ అల్లాహ్ గ్రంథం. అది సురక్షితమైన ప్రదేశం నుండి అవతరించిన గొప్ప గ్రంథం. ఖుర్ఆన్ పేర్కొంటున్న లెక్కల దినం, అంతిమ దినం రావటం తథ్యం. సుస్పష్టం నిర్ణయాత్మకం అయిన విషయం. దానిని పరిహాసంగా తలచకండి. మామూలు విషయంగా భావించకండి. అంతిమ దినం ప్రాముఖ్యాన్ని గుర్తించండి. దానిపట్ల శ్రద్ధ వహించండి. అందుకు తయారీ చేయండి. అంతిమదినాన్ని విశ్వసించండి. సదాచరణ చేయండి. దురాచరణ విడనాడండి. మీరు గనక ప్రపంచాన్ని గురించి మాత్రమే ఆలోచించి, అంతిమదినాన్ని (పరలోకాన్ని) మరచిపోతే నిస్సందేహంగా సర్వనాశనం అవుతారు.

## 86. అత్ తారిఖ్

**ఆయత్‌లు** : 17 **అవతరణ** : మక్కాలో

*పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో*

(1) ఆకాశం సాక్షి! మరియు రాత్రిళ్ళు వచ్చే దాని సాక్షి! (2) రాత్రిళ్ళు వచ్చేవి ఏమిటో మీకు తెలుసా? (3) అవి మెరిసే నక్షత్రాలు (4) తనపై కావలివాడు లేని మనిషి ఎవరూ లేరు, అంటే ప్రతి ఒక్కరిపై ఒక కావలివాడు ఉన్నాడు. ఒక గూఢచారి వెన్నంటి ఉన్నాడు. (5) తాను ఏ వస్తువుతో పుట్టించబడ్డాడో మనిషి ఆలోచించాలి. (6) ఎగసిపడే నీటితో పుట్టించబడ్డాడు. (7) అది వెన్నెముక మరియు ప్రక్కటెముకల మధ్య నుండి వస్తుంది. (8) నిస్సందేహంగా అల్లాహ్ అతణ్ని తిరిగి బ్రతికించే శక్తి గలవాడు. (9) ఏ రోజు మనసులలోని మర్మాలు పరిశీలించబడతాయో (10) అప్పుడు అతని వద్ద ఎటువంటి శక్తీ ఉండదు. సహాయం ఎవరూ చేయరు. (11) మరియు వర్షాన్ని కురిపించే ఆకాశం సాక్షి! (12) మరియు చీలిపోయే భూమి సాక్షి! (13) ఇది నిర్ణయాత్మక విషయం

آیاتها 17 | سورة الطارق 86 مكية | ركوعها 1

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

وَالسَّمَآءِ وَالطَّارِقِ ﴿1﴾ وَمَآ اَدۡرٰىكَ مَا
الطَّارِقُ ﴿2﴾ النَّجۡمُ الثَّاقِبُ ﴿3﴾ اِنۡ كُلُّ
نَفۡسٍ لَّمَّا عَلَيۡهَا حَافِظٌ ﴿4﴾ فَلۡيَنۡظُرِ
الۡاِنۡسَانُ مِمَّ خُلِقَ ﴿5﴾
خُلِقَ مِنۡ مَّآءٍ دَافِقٍ ﴿6﴾ يَّخۡرُجُ مِنۡۢ بَيۡنِ
الصُّلۡبِ وَالتَّرَآئِبِ ﴿7﴾ اِنَّهٗ عَلٰى رَجۡعِهٖ لَقَادِرٌ ﴿8﴾
يَوۡمَ تُبۡلَى السَّرَآئِرُ ﴿9﴾ فَمَا لَهٗ مِنۡ قُوَّةٍ
وَّلَا نَاصِرٍ ﴿10﴾ وَالسَّمَآءِ ذَاتِ الرَّجۡعِ ﴿11﴾
وَالۡاَرۡضِ ذَاتِ الصَّدۡعِ ﴿12﴾ اِنَّهٗ لَقَوۡلٌ
فَصۡلٌ ﴿13﴾

| | |
|---|---|
| (14) నవ్వులాట కాదు, (అంటే అంతిమ దినం రావడం నిశ్చయం). ఇది ఇక వాస్తవం. (15) వీరు అంటే తిరస్కారులు మాయోపాయం పన్నుతున్నారు. (16) నేనూ ఒక ఎత్తుగడ వేస్తున్నాను. (17) ఓ ప్రవక్తా! తిరస్కారులకు నీవు కొన్ని దినాల వ్యవధినివ్వు. | وَّمَا هُوَ بِالْهَزْلِ ﴿14﴾ اِنَّهُمْ يَكِيْدُوْنَ كَيْدًا ﴿15﴾ وَّاَكِيْدُ كَيْدًا ﴿16﴾ فَمَهِّلِ الْكٰفِرِيْنَ اَمْهِلْهُمْ رُوَيْدًا ﴿17﴾ |

ع 1 17 11